




RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :125 | మంగళవారం ఆగస్ట్ 25, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5


# తెలంగాణపై ఏంటీ వివక్ష?

## గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. నన్ను అడ్డుకుంటారా?: సీఎం రేవంత్ రెడ్డి



- అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చారని వ్యాఖ్య
- ఇది తెలంగాణ ప్రజలకు అవమానం: రేవంత్
- కేంద్రం తీరుపై రాజకీయ వివక్ష ఆరోపణ
- పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించే కుట్ర: సీఎం
- అమెరికా పర్యటనకు అన్ని వివరాలు ఇచ్చామని వెల్లడి
- 'రాజకీయ కారణం' అంటే ఏమిటని ప్రశ్న
- డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు
- కేంద్ర నిర్ణయాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని వెల్లడి
- తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలని పిలుపు

హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి(జవీ =వఋుత్ష్ట్ర =వఎఎఎ) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు.

2లో

## విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం

### - అమిత్ షా



- మలేషియాలో ముగ్గురు గ్యాంగ్‌స్టర్లు అరెస్ట్
- జస్‌ప్రీత్, అజయ్, పవన్‌దీప్ సింగ్‌లుగా గుర్తింపు
- బంబీహా గ్యాంగ్‌తో సంబంధాలు
- బెదిరింపులు, ఆయుధాలు, డ్రగ్స్ కేసులు
- లూధియానా గ్రనేడ్ దాడి కుట్రలోనూ ప్రమేయం
- ఈ ఏడాది 51 మంది నేరస్థుల అప్పగింత
- విదేశాల్లో దాక్కున్న నిందితులపై చర్యలు

దేశంలో కుట్రలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకున్న నిందితులపై భారత్ ఉక్కుపాదం మోపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాఅన్నారు. దేశం విడిచి పారిపోయిన ముగ్గురు గ్యాంగ్‌స్టర్లను మలేషియాలో పట్టుకున్న దర్యాప్తు ఏజన్సీలు భారత్‌కు తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

2లో

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం



2లో

- పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న దాహార్తి
- రూ. 280 కోట్ల నిధుల కేటాయింపు
- 96 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి
- గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా

## శాఖల్లో సమర్థత –- సేవల్లో నాణ్యత

### సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్

- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



**అమరావతి, ఆగస్ట్ 24 :** ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్... వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్ధత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ**

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్ లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

2లో

## రామచందర్‌రావుకు పొన్నం ప్రభాకర్ కౌంటర్



- చేతనైతే కేంద్రం నుంచి నిధులు సాధించండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మొసలి కన్నీరు వద్దు
- పాత బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నాం
- ఈ ఏడాది నుంచి అడ్వాన్స్ పేమెంట్‌కు చర్యలు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందా?

2లో

## 22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు: మంత్రి పొంగులేటి

- 22ఏ భూముల విషయంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు
- బాధితులకు న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ
- 22ఏ జాబితా, వివిధ ఆర్డర్ల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- రిలాక్సేషన్ వచ్చిన భూముల సమస్యలు క్లియర్ చేశాం
- ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ 1162కు 1,162 కాల్స్
- వచ్చిన ఫిర్యాదులను జిల్లాల వారీగా అధికారులకు పంపిణీ
- ప్రైవేటు ఆస్తుల కంటే ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ
- నిలిచిపోయిన 22ఏ రిజిస్ట్రేషన్లు 24 గంటల్లో క్లియర్



హైదరాబాద్: 22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. వారికి న్యాయం చేస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా అధికారులతో దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. రిలాక్సేషన్ వచ్చిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్‌లోని భూదాన్ భూముల్లోని వాటిని తిరస్కరించాం. ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన కాల్స్‌ను జిల్లాల వారీగా పంపించాం. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశాం. ఎక్కడైనా ఒకట్రెండు ఆగిపోతే పరిష్కరిస్తాం.. ఆందోళన అవసరం లేదు" అని పొంగులేటి తెలిపారు.

- ఎక్కడైనా ఒకట్రెండు సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం
- ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నాం

## మద్యం కుంభకోణానికి కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్

### దోపిడీ కోసమే మద్యం పాలసీ మార్పు



2లో

- బలహీన వర్గాల నేతలను బలిపశువులను చేశారు
- తప్పులు బయటపడటంతో రాజకీయ కక్షలంటూ ఎదురుదాడి
- మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం

**మంగళగిరి, ఆగష్టు 24 :** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతిపెద్ద స్కామ్‌లలో ఒకటని గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మద్యపాన నిషేధం పేరిట అధికారంలోకి వచ్చి, వేల కోట్ల రూపాయలు దోచుకోవడానికి వీలుగా విధానాలను రూపొందించారని విమర్శించారు. మద్యం తయారీ నుంచి రవాణా వరకు ప్రతి దశలోనూ దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు.

## నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు



2లో

## మతం మారాలని సౌజన్యపై సాథిక్ ఒత్తిడి తెచ్చాడు: కాకినాడ ఎస్పీ



2లో

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

మంగళవారం ఆగస్ట్ 25, 2026

# సంపాదకీయం

## ఇప్పటికీ అంతే కొత్త పాళీ!

తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: "...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..."

1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: "మూడు సంవత్సరాలు--వెయ్యిరోజులు--దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? ...దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్దీ ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత."

ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం 'కొత్తపాళీ'లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే 'కొత్తపాళి' సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇటీవల మళ్ళీ వారి రచనలు 'ఇనుప కచ్చడాలు', 'దేవాల యాలపై బూతు బొమ్మలు', 'సాహిత్య మొర్మరాలు', 'పాత పాళీ', 'కొత్తపాళీ' పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. 'కొత్తపాళీ' గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు 'కొత్తపాళీ'ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది.

నిజానికి తాపీధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? -- అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికీ, సమయానికీ -- గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు.

సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి: అ) సాహిత్య విమర్శను రీడబుల్‌గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ -- వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ.

ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: "...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే..."

అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి."

"తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి," అని కూడా చెప్తారు తాతాజీ.

ఈ క్లారిటి చూడండి: "...అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి. ఏమైనాసరే తెలియడం ప్రధానం..." అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది -- కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే!

వారి 'కొత్తపాళీ' వ్యాసాల నుంచి కొన్ని పదునైన వాక్యాలు, పరిశీలనలు:

1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుప్పి తెలియకుండా చేయడం అక్రమం, తన పాండిత్యం ప్రదర్శించడానికే వ్రాసుకొనడమే అంటుంది మొల్ల--నన్నయ గురించి.

2) జాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు -- నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి.

3) కవిసమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్యమర్యాదలన్నారు, నాటకలక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు... ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి.

4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా?

5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు.

6) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వదృష్టీ చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళ్ళున్న వ్రాతగాడిలా కనిపిస్తాడే!

7) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్రసారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు?

8) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు.

# పాపాల ఫలితమే కారుమూరి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగస్టు 24 :**
గత ప్రభుత్వంలో చేసిన పాపాల ఫలితమే మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్ అని, ఇది కక్షసాధింపు కాదని ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈడీ చేపట్టిన చట్టబద్ధమైన చర్యలకు కులం, కక్ష రంగు పూయడం అర్థరహితమని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో అవినీతి నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

**మద్యం కుంభకోణంలో కీలక పాత్ర**
గత ప్రభుత్వంలో మద్యం అక్రమ రవాణా, విక్రయాల్లో కారుమూరి నాగేశ్వరరావు ప్రధాన పాత్ర పోషించారని గల్లా మాధవి ఆరోపించారు. ఈ కుంభకోణంలో ఆయన కుటుంబానికి కోర్టులు కూడా బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో చట్టం నిష్పక్షపాతంగా తన పని తాను చేసుకుపోతోందని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటుంటే కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయడం సరికాదని పేర్కొన్నారు.

**ప్రజలను మభ్యపెట్టే యత్నం**
వైసీపీ నాయకులకు న్యాయస్థానాలు, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఏమాత్రం గౌరవం లేదని ఆమె విమర్శించారు. చేసిన తప్పుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ ముసుగులో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

# మద్యం కుంభకోణానికి కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్

మొదటిపేజీ తరువాయి

**చట్టం ముందు అందరూ సమానమే**
అవినీతికి పాల్పడింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. దోచుకున్న ప్రజాధనాన్ని ఫేక్ కంపెనీలు, డెన్‌ల ద్వారా ఎన్నికల్లో ఖర్చు చేశారని తెలిపారు. పక్కా ఆధారాలు ఉండటం వల్లే న్యాయస్థానాలు నిందితులకు బెయిల్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి దర్యాప్తు సంస్థలపై రాజకీయ కక్షలంటూ ఎదురుదాడి చేయడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని తెలిపారు.

**బలహీన వర్గాలను పావులుగా వాడుకున్నారు**
స్వార్థ ప్రయోజనాల కోసం బీసీ, ఎస్సీ, మైనారిటీ నాయకులను పావులుగా వాడుకుని చివరకు వారిని బలిపశువులను చేశారని ఆరోపించారు. ఎటువంటి నేర చరిత్ర లేని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వంటి వారిని మద్యం దోపిడీలోకి లాగారని తెలిపారు. లూటీ చేసిన ప్రజాధనాన్ని రియల్ ఎస్టేట్, విదేశీ మైనింగ్ వ్యాపారాలకు తరలించారని మంత్రి పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

మొదటిపేజీ తరువాయి

గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు.

**భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!**
లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు భాజపా నేతలు కొందరు నా పర్యటన వివరాలపై తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

**'రాజకీయ కారణం' అంటే ఏమిటి?**
నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

**నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు**
కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

**మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?**
నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

**తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి**
తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పులివెందుల తాగునీటి పథకానికి

# పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 24 (సదా మీకోసం):**



జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రాధాన్యమిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులను వేగవంతం చేశారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ పథకం గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాలతో కేంద్రం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించింది. దీంతో ఈ పథకానికి దాదాపు రూ. 280 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశారు.

పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతుండగా, పులివెందుల పట్టణంలో పనులు 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలంలో 24 ఆవాసాలకు త్వరలో నీరందనుంది. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

# విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

నిందితులు బంబీహా ముఠాతో సంబంధాలు కలిగిన జస్‌ప్రీత్ సింగ్, అజయ్ సింగ్, పవన్‌దీప్ సింగ్‌లుగా తెలిపారు. వీరిపై పలు తీవ్రమైన నేరాల ఆరోపణలు ఉన్నాయని షా పేర్కొన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 51 మంది కరడుగట్టిన నేరస్థులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సురక్షిత, భద్రమైన భారత్ లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన గ్రనేడ్ దాడి కుట్రలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

# మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు: కాకినాడ ఎస్పీ

మొదటిపేజీ తరువాయి

కాకినాడ: ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

"ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాం. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చాం.

**5 రోజుల్లో 4 రాష్ట్రాల్లో సాధిక్ మకాం**
నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశాం. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని ఎస్పీ కోరారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్**
సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు.. తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఓ ఏసీపీ స్థాయి అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' వేదికగా సోమవారం ఆరోపణలు చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ సమర్థమైన అధికారి అని పేర్కొంటూనే.. పోలీసు వ్యవస్థ పనితీరుపై ఎంపీ పలు ప్రశ్నలు సంధించారు. 'తెలంగాణ పోలీస్ శాఖ రాజ్యాంగం, చట్టబద్ధమైన ఆదేశాల ప్రకారం పనిచేస్తోందా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటోందా?' అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ రాజకీయ కుటుంబాలకు కాకుండా చట్టానికి జవాబుదారీగా ఉండాలని అర్వింద్ పేర్కొన్నారు.

# శాఖల్లో సమర్థత -- సేవల్లో నాణ్యత

మొదటిపేజీ తరువాయి

అయితే గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# తిరుపతి డిఎస్పీ పేరుతో కోట్లలో మోసం

## కేటుగాడి అరెస్ట్

హైదరాబాద్ (ఆగస్టు 24): జన తెలంగాణ

తిరుపతి జిల్లా డిఎస్పీ (ఐఎ. ౫ా.)నంటూ నకిలీ అవతారమెత్తి, బోగస్ కంపెనీల్లో పెట్టుబడుల పేరిట అధిక లాభాలు ఇప్పిస్తామని నమ్మించి అమాయకులను నిలువునా ముంచిన ఓ ముఠా సభ్యుడిని హైదరాబాద్ సీసీఎస్ (డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్) ఈఓడబ్ల్యూ (జూఖె) బృందం అరెస్టు చేసింది. అరెస్టయిన నిందితుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకట్ రాజు అలియాస్ కేవీపీ రాజు అలియాస్ డిఎస్పీ రాజు (40)గా పోలీసులు గుర్తించారు. నిందితుడు 2021 నుంచి పరారీలో ఉన్నాడని తెలిపారు.

కేసు వివరాలు: పోలీసుల కథనం ప్రకారం... నిందితుడు కేవీపీ రాజు, అతని ముఠా సభ్యులు తాము సీనియర్ పోలీస్ అధికారులమని ప్రచారం చేసుకుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అనేక మంది అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉనికిలో లేని నకిలీ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే స్వల్పకాలంలోనే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. బాధితులకు నమ్మకం కలిగించేందుకు సెక్యూరిటీ పేరిట నకిలీ ఆస్తి పత్రాలు, పోస్ట్ డేటెడ్ చెక్కులను ఇచ్చేవారు. సమయానికి డబ్బులు



తిరిగి ఇవ్వకపోగా, బాధితులు నిలదీస్తే తాము 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులమంటూ' బెదిరింపులకు దిగేవారు. ఈ క్రమంలోనే ఒక ఫిర్యాదుదారుడి నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేసి మోసం చేయడంతో, బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్: 192/2021 (ఖ/రావష 406, 420, 170 తీ/ష 34 ౫ూజ) నమోదు చేశారు.

ఇతర నేరాలు: నిందితుడు కేవీపీ రాజుపై ఇదివరకు 3 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు:

తిరుపతి సీసీఎస్ ౯ూ: జతీ. చీశీ: 09/2021 (ఖ/o 419, 420 =/ష 34 ౫ూజ)

తుకారాంగేట్ ౯ూ (హైదరాబాద్): జతీ. చీశీ: 46/2022 (ఖ/o 420, 468, 471 =/ష 120(దీ) ౫ూజ)

వేదాయపాళెం ౯ూ (నెల్లూరు జిల్లా): జతీ. చీశీ: 325/2022 (ఖ/o 420, 406, 468, 170 =/ష 120(దీ) ౫ూజ)

హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఐజూ) నేతృత్వంలో, జూఖె టీమ్-ఎ ఏసీపీ కె. కిరణ్ పర్యవేక్షణలో ఎస్ఐ జి. అనిల్ కుమార్ సిబ్బంది నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

ప్రజా హెచ్చరిక: అధిక లాభాలు ఇప్పిస్తామంటూ చేసే నకిలీ వాగ్దానాలను, ప్రచారాలను నమ్మి అమాయక ప్రజలు ఎవరూ తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి మోసపోవద్దని హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఐజూ) ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పవర్ ఎగ్జిబిషన్--2026ను సందర్శించిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఐపీఎస్

హైదరాబాద్, ఆగస్టు 24, జన తెలంగాణ




హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్, రిటైర్డ్ డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వి. శివాజీ, కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్. నరసింహులు తదితర అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించిన ఆయన, విద్యుత్ రంగ చరిత్ర, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలను ప్రజలకు చేరవేసే ఈ ఎగ్జిబిషన్ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతలో విద్యుత్ రంగంపై అవగాహన పెంపొందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ గారిని, సంస్థ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టి

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ

ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టికొడుతుందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు పాలమూరు పంపులు, కేఎల్ఐ, జూరాల పంపులు నిరంతరాయంగా నడపాలనీ

కాంగ్రెస్ ప్రభుత్వం నోరు తెరవాలి .. లేకుంటే సర్కారు దుర్మార్గాన్ని ఎండగడతాంవరదలేకున్నా రోజుకు 5 వేల క్యూసెక్కుల నీళ్లు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుండి రీజనరేటెడ్ వాటర్ జూరాలకు వస్తాయినీళ్లు లేవని రైతులను పంటలు వేయకుండా ప్రభుత్వం భయపెట్టింది .. సర్కారు భయానికి సగం మంది రైతులు పంటలు సాగు కూడా చేయలేదనీ వెల్లడించారు పంటలు వేయొద్దు. పంటలు కొనొద్దు. బోనస్ ఇవ్వొద్దు అన్నట్లు ఎల్ నినో పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదనీ క్రిష్ణా నది మీద ఉన్న తొలి ప్రాజెక్టు జూరాల. దాని సామర్థ్యం కేవలం 6 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ లో 854 అడుగులకు చేరిన వెంటనే ఏపీ పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుందన్నారు హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు పేరుతో శ్రీశైలం నిర్మించి, మద్రాసుకు తాగునీరు పేరుతో వెళ్లే దారిలో రైతులకు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అని పోతిరెడ్డిపాడును మొదలుపెట్టారువైఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత 11 వేల క్యూసెక్కులు తరలించే పోతిరెడ్డిపాడును అదనంగా మరో 44 వేల క్యూసెక్కులు తరలించేలా ఉమ్మడి రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. అదే సమయంలో 235 టీఎంసీల సామర్థ్యంగల రిజర్వాయర్లను నిర్మించారన్నారు ఈ రిజర్వాయర్లకు ఎలాంటి అనుమతులు, నీటి కేటాయింపులు లేకున్నా నిర్మించారు. అదే సమయంలో తెలంగాణలో కూడా ప్రాజెక్టులు చేపట్టాం అని చూయించేందుకు జూరాల మీద మొక్కుబడిగా పనులు చేపట్టారుశ్రీశైలం రిజర్వాయర్ మీద ఆధారపడ్డ ఎస్ఎల్ బీసీ ప్రాజెక్టును మూడు దశాబ్దాలుగా పెండింగ్ పెట్టారు. కేఎల్ఐ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేయడం జరిగింది. దీనిని 200 పైచిలుకు రోజులు నడుపుకున్న 40 టీఎంసీలు కూడా వాడుకునే పరిస్థితి లేదనీ మండిపడ్డారు ఈ నేపథ్యంలోనే పాలమూరు




రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం రిజర్వాయర్ నుండి సాగునీరు ఎత్తిపోసుకునేలా కేసీఆర్ పూర్తిగా రాష్ట్ర నిదులతో నిర్మించారు. దీనిని అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం, తెలంగాణ ఇంటిదొంగలు శతవిధాల కేసులు వేసి ప్రయత్నించారు. అన్ని అడ్డంకులు దాటుకుని కేసీఆర్ అన్ని అనుమతులు సాధించి నిర్మించారనీ గుర్తు చేశారు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.600 లేదా రూ.700 కోట్లు ఖర్చు పెడితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పరిధిలోని రిజర్వాయర్లు నింపుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎల్నినో వచ్చినా పాలమూరు రైతాంగానికి సాగునీరు అందేది. భూగర్భజలం పెరిగేది. అందాల పోటీలు, మెస్సీతో ఫుట్ బాల్ కోసం పెట్టిన ఖర్చు దీనికి పెడితే రైతాంగానికి సాగునీరు అందేది. శ్రీశైలంలో 100 టీఎంసీల నీళ్లు ఉన్నప్పుడు కూడా పాలమూరు రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించాం అని ప్రస్తుతం కూడా శ్రీశైలం రిజర్వాయర్లో 170 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కేఎల్ఐ కాలువ చివరి వరకు సాగునీరు వెళ్లకపోవడం జిల్లా మంత్రుల అసమర్థతకు నిదర్శనం అని పేర్కొన్నారు రోజుకు సగటున ఏపీ ప్రభుత్వం 12 టీఎంసీల నీళ్లను ఏపీకి తరలిస్తున్నదనీ తెలంగాణ నీళ్లు ఎలా ఇవ్వొద్దు అని ఏపీ చీఫ్ సెక్రటరీ, ఇరిగేషన్ సెక్రటరీ ఆదిత్యానాథ్ దాస్ ను తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వం సిగ్గులేకుండా ఉద్దేశపూర్వకంగా సలహాదారుగా పెట్టుకుందిఎన్నిసార్లు ఎత్తిచూపినా ఈ ప్రభుత్వానికి సోయి రావడం లేదు. ఆంధ్రా ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు జలయజ్ఞంలో భాగంగా వైఎస్ 840 అడుగుల వద్ద వెలుగోడు ప్రాజెక్టుకు టన్నెల్స్ నిర్మించారు. దీనికింద 53 టీఎంసీల సామర్థ్యం ఉన్న నల్లమల సాగర్ రిజర్వాయర్ ను నిర్మించారు. త్వరలో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. శ్రీశైలంలో 854 అడుగుల దిగువకు నీళ్లు వెళ్తే 840 అడుగుల వద్ద షటర్ ఎత్తి సాగునీళ్లు ఎత్తుకెళ్లారువెలుగోడు ద్వారా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వ 9.2 దయామీటర్, 7.2 దయామీటర్ల వెడల్పుతో సొరంగాలని నిర్మించడం పూర్తి చేసిందనీ ధ్వజమెత్తారు అటవీ అనుమతులు, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు ఏవీ లేకుండా, అన్నీ పక్కన పెట్టి అక్కడ పనులు పూర్తి చేస్తున్నారనీ ఈ నీటి దోపిడీని అడ్డుకోకుండా జిల్లా మంత్రి సిగ్గూ ఎగ్గూ లేకుండా శ్రీశైలం డ్యామ్ వద్ద ధర్నా చేస్తానని చెబుతున్నాడు. చేతనైతే ఆంధ్రా నీటి దోపిడీ మీద కేఆర్ఎంబీ ముందుకు వెళ్లి కొట్లాడాలన్నారు ఏం ఆశించి తెలంగాణ రిజర్వాయర్లు, ఎత్తిపోతల పనులను పూర్తి చేయకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదికాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉంటారో ? ఎవరు పోతారో ? వారి ఇష్టం. వాటితో ప్రజలకు, రైతులకు సంబంధం లేదనీ అన్నారు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మంత్రులు లేరు. కొన్ని శాఖలకు దిక్కులేదు. సర్కారు నడుపుతున్నారా ? సర్కస్ నడుపుతున్నారా ?ప్రభుత్వంలో ఒకరి మీద ఒకరికి నియంత్రణ లేదు .. సాగర్ నిండినా సాగునీళ్లు ఇవ్వం అని మంత్రి చెప్పడం ఎంత చేతగానితనం. మీకు చేతకాదు అంటే చేతకాదు అని ప్రజలకు చెప్పాలనీ పేర్కొన్నారు ఆంధ్రా సాగునీటి దోపిడీని అడ్డుకోకుంటే అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వంగా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. ఈ ప్రెస్ మీట్ లో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్షవర్ధన్ రెడ్డి,గాదరి కిషోర్ కుమార్ ,బీ ఆర్ ఎస్ నేత అభిలాష్ రంగినేని పాల్గొన్నారు )

# పవర్ ఎగ్జిబిషన్--2026ను సందర్శించిన సిద్ధార్థ, ఎంజీఐటీ విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 24, జన తెలంగాణ



హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను ఇబ్రహీంపట్నం సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) విద్యార్థులు సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు, స్మార్ట్ మీటరింగ్, విద్యుత్ భద్రత, ఆధునిక సాంకేతికతలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. అధికారులు విద్యుత్ రంగానికి సంబంధించిన పలు అంశాలను వివరించగా, విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పవర్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యుత్ రంగ చరిత్ర, అభివృద్ధి, సాంకేతిక పురోగతిపై విలువైన అవగాహన లభించిందని విద్యార్థులు తెలిపారు.

# అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులతో ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం.

హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ

హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్,రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్ల పల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్,మట్టా రాగ మాయి,మందుల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.

# ఫీజుల బకాయి-బీజేపీ లడాయి పేరుతో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ గారి ప్రకటన

హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ

- ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డల ఉన్నత విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం గొంతు నులుముతోందనీ ఆరోపించారు
- విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అన్న సీఎం రేవంత్‌కు వారి ఉసురు తగలక తప్పదనీ
- రూ. 15,000 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆగదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారి నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు

తెలంగాణలో ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేద విద్యార్థుల పాలిట శాపంగా మారింది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయి, 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయి. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' పేరుతో మా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నాను.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అనేది కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాదు, అది సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ బడుగు బలహీన వర్గాల బిడ్డల ఆత్మగౌరవ ప్రతీక. పేదరికం నుంచి బయటపడేందుకు ఉన్నత విద్యను ఆశ్రయించిన యువతకు ఈ కాంగ్రెస్ సర్కార్ తీవ్ర ద్రోహం చేస్తోంది. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీలు సర్టిఫికెట్లు నిలిపివేయగా, చదువు పూర్తయిన పేద విద్యార్థులు చేతికందిన ఉద్యోగాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కోల్పోయి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నిధుల లేమితో ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడుతుంటే, అధ్యాపకులు రోడ్డున పడుతుంటే ప్రభుత్వానికి కనీస బాధ్యత లేకుండా పోయిందనీ మండిపడ్డారు ఎన్నికల సమయంలో అశోక్ నగర్ రోడ్లలో రాహుల్ గాంధీ నిరుద్యోగులను, విద్యార్థులను కౌగిలించుకుని ఇచ్చిన బూటకపు హామీలను నమ్మి తెలంగాణ యువత మోసపోయింది. నాడు ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నేతలు, నేడు న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తే విద్యార్థులపై అర్ధరాత్రి దాడులు చేయించి లాఠీచార్జీలకు తెగబడుతున్నారు. అంతటితో ఆగకుండా, తమ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన విద్యార్థులు, నిరుద్యోగులను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'క్రిమినల్ వేస్ట్' అంటూ హేయంగా సంబోధించడం ఆయన నియంతృత్వ పోకడలకు పరాకాష్ట. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన విద్యార్థి లోకాన్ని ఇంత దారుణంగా అవమానించిన సీఎం రేవంత్ రెడ్డికి ఆ బిడ్డల ఉసురు తగలక తప్పదు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చి ఇక్కడి విద్యార్థుల అసలైన ఆక్రోశాన్ని వినాలని డిమాండ్ చేస్తున్నాననీ తెలిపారు ఉన్నత విద్యే కాకుండా పాఠశాలలు, గురుకులాల వ్యవస్థను సైతం కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా నిర్వీర్యం చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా పేద విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఎడ్యుకేషన్ కిట్లు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. మరోవైపు గురుకులాల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నా, రాగిజావ వంటి పౌష్టికాహార పథకాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతున్నా పట్టింపు లేదు. విద్యాశాఖను స్వయంగా తన దగ్గరే ఉంచుకుని విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 15,000 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి, లేనిపక్షంలో విద్యార్థి లోకం పక్షాన భారతీయ జనతా పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందనీ తెలిపారు

## జి హెచ్ ఏం సి ప్రజావాణి ఫిర్యాదులు

హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ




సోమవారం రోజు +ఎవీజ ప్రధాన కార్యాలయంలో క్రింది అధికారుల సమక్షంలో ప్రజావాణి ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించబడింది:

+ఎవీజ కమిషనర్

లిఅదనపు కమిషనర్ (అడ్మిన్), +ఎవీజ

అదనపు పోలీస్ సూపరింటెండెంట్ (విజిలెన్స్), +ఎవీజ

అదనపు కమిషనర్ (ఖజణ డ ఎస్టేట్స్), +ఎవీజ

చీఫ్ సిటీ ప్లానర్, +ఎవీజ

చీఫ్ ఇంజనీర్, +ఎవీజ

చీఫ్ వెటర్నరీ ఆఫీసర్, +ఎవీజ

జాయింట్ కమిషనర్ (రెవెన్యూ), +ఎవీజ

(2) అదనపు చీఫ్ సిటీ ప్లానర్లు, +ఎవీజ

చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్, +ఎవీజ

ల్యాండ్ అక్విజిషన్ విభాగం, +ఎవీజ

జోన్ వారీగా స్వీకరించిన ఫిర్యాదులు:

శంషాబాద్ జోన్: 09

రాజేంద్రనగర్ జోన్: 03

చార్మినార్ జోన్: 02

గోల్కొండ జోన్: 0

ఖైరతాబాద్ జోన్: 0

సికింద్రాబాద్ జోన్: 05

ప్రధాన కార్యాలయం: 41

మొత్తం స్వీకరించిన ఫిర్యాదులు: 60

# పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ల ఎంపిక ప్రక్రియ

**60 పోస్టులకు 2,167 దరఖాస్తులు**

**పైరవీలకు ఆస్కారం లేదు**

**మెరిట్, మౌఖిక పరీక్ష ఆధారంగానే ఎంపిక**

**జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి**

కరీంనగర్ ఆగస్టు 24 జన తెలంగాణ

అంగన్వాడి టీచర్ల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎలాంటి పైరవీలకు ఆస్కారం ఉండబోదని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర ఐసిడిఎస్ ప్రాజెక్టులో 20 అంగన్వాడి టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 535 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హుజురాబాద్ ప్రాజెక్టులో 16 పోస్టులకు 449, కరీంనగర్ రూరల్ ప్రాజెక్టులో 16 పోస్టులకు 574, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టులో 8 పోస్టులకు 609 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. మొత్తంగా జిల్లాలో 60 పోస్టులకు గాను 2,167 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ నుండి 15 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిందని, సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయాల సిడిపిఓలు దరఖాస్తులన్నింటిని డౌన్లోడ్ చేసుకోవడం పూర్తయిందని తెలిపారు. త్వరలో అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ప్రారంభిస్తామని, వెరిఫికేషన్ తేదీని అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

## పైరవీలకు ఆస్కారం లేదు

అంగన్వాడి టీచర్ల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఇంటర్ మార్కుల మెరిట్, ప్రత్యేక కేటగిరీల వారీ మార్కులు ( వితంతువులు, అనాథలు, దివ్యాంగులు), జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ ఆధారంగా మాత్రమే అభ్యర్థి ఎంపిక చేయబడతారని వివరించారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకమని తెలిపారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 25, 2026

# పవర్ ఎగ్జిబిషన్--2026కు విశేష ప్రజాదరణ -- మూడు రోజుల్లో 12 వేల మందికి పైగా సందర్శకులు

**హైదరాబాద్, ఆగస్టు 24, జన తెలంగాణ**

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23, 24 తేదీలలో నిర్వహించిన పవర్ ఎగ్జిబిషన్--2026కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనను విద్యార్థులు, యువత, విద్యుత్ వినియోగదారులు, సాంకేతిక నిపుణులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, కుటుంబాలతో వచ్చిన సందర్శకులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. మొత్తం 12 వేల మందికి పైగా సందర్శకులు హాజరై ఎగ్జిబిషన్‌ను ఘనవిజయవంతం చేశారు.మూడవ రోజు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ూాజు=జ) ఛైర్మన్ డా. జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల (టెక్నికల్), చెరుకూరి శ్రీనివాసరావు (ఫైనాన్స్) ఎగ్జిబిషన్‌ను సందర్శించి వివిధ స్టాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వి. శివాజీ,కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్. నరసింహులుతో పాటు మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల అధికారులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు.అదే రోజు టిఆర్ఎస్ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత ఎగ్జిబిషన్‌ను సందర్శించి దాదాపు 30 నిమిషాల పాటు ప్రతి స్టాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యుత్ రంగ చరిత్ర, ఆధునిక సాంకేతికతలు, ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ఎగ్జిబిషన్‌ను రూపొందించినందుకు తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ మూడు రోజుల ప్రదర్శనలో తెలంగాణ విద్యుత్ రంగం 120 ఏళ్ల ప్రస్థానం, విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థల అభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్‌లు, డిజిటల్ సేవలు, భద్రతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న చర్యలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా



ప్రదర్శించారు.ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన పాతకాలపు విద్యుత్ మీటర్ల నుంచి ఆధునిక స్మార్ట్ మీటర్ల వరకు వివిధ పరికరాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పెద్దలు పిల్లలకు విద్యుత్ మీటర్ల పరిణామ క్రమాన్ని వివరిస్తూ కనిపించారు. విద్యుత్ వ్యవస్థలో చోటుచేసుకున్న సాంకేతిక మార్పులు, ఆధునికీకరణ గురించి తెలుసుకుంటూ సందర్శకులు ఆసక్తి కనబరిచారు.ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. విద్యుత్ రంగంలో ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరికరాలు, సబ్‌స్టేషన్లు, స్మార్ట్ వ్యవస్థలు, భద్రతా పరికరాలను ప్రత్యక్షంగా చూసి విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలలో చదివే అంశాలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా విద్యుత్ రంగంపై తమ అవగాహన మరింత పెరిగిందని పేర్కొన్నారు.ఈ ఎగ్జిబిషన్‌ను ఎచీ= ఎజీ×జు, జవీ= ఇంజినీరింగ్ కాలేజ్, దీఎ=×ు, విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జదీ×ు, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, మహావీర్ ఇంజినీరింగ్ కాలేజ్, మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ తదితర ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు సందర్శించారు. వీటితో పాటు పాఠశాల విద్యార్థులు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### లేజర్ షోకు విశేష ఆదరణ

ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన లేజర్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి రోజు సాయంత్రం 7:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనను చిన్నారులు, యువత, కుటుంబాలతో వచ్చిన సందర్శకులు ఆసక్తిగా వీక్షించారు. విద్యుత్ రంగ చరిత్ర, సాంకేతిక అభివృద్ధి, తెలంగాణ విద్యుత్ రంగ ప్రగతిని సృజనాత్మకంగా ప్రతిబింబించిన లేజర్ షో అందరి ప్రశంసలు అందుకుంది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మరిన్ని రోజులు కొనసాగించాలని అనేక మంది సందర్శకులు కోరారు.ప్రజల స్పందనతో శాశ్వత ప్రదర్శన కేంద్రం దిశగా పవర్ ఎగ్జిబిషన్‌కు లభించిన అపూర్వ స్పందన నేపథ్యంలో భవిష్యత్‌లో విద్యార్థులు, విద్యుత్ వినియోగదారులు, ప్రజల కోసం విద్యుత్ రంగ చరిత్ర, ఆధునిక సాంకేతికతలను ప్రతిబింబించే ప్రత్యేక శాశ్వత ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ తెలిపారు. ప్రజలు, విద్యార్థులు ఏడాది పొడవునా విద్యుత్ వ్యవస్థ గురించి తెలుసుకునేలా ప్రత్యేకంగా విద్యుత్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు పేర్కొన్నారు.ప్రజల్లో విద్యుత్ భద్రత, విద్యుత్ వినియోగంపై అవగాహన పెంపొందించడం, విద్యార్థులకు సాంకేతిక జ్ఞానాన్ని అందించడం, విద్యుత్ రంగ అభివృద్ధిని ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా నిర్వహించిన పవర్ ఎగ్జిబిషన్--2026 తెలంగాణ విద్యుత్ రంగ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. మూడు రోజుల పాటు ప్రజల నుంచి లభించిన విశేష ఆదరణ, స్పందన ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

# పవర్ ఎగ్జిబిషన్--2026ను సందర్శించిన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్, సభ్యులు

**హైదరాబాద్, ఆగస్టు 24, జన తెలంగాణ**

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ూాజు=జ) ఛైర్మన్ డా. జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల (టెక్నికల్), చెరుకూరి శ్రీనివాసరావు (ఫైనాన్స్) సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఊ మేనేజింగ్ డైరెక్టర్ తరఫున డైరెక్టర్లు వి. శివాజీ, కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్. నరసింహులు, అలాగే మెట్రో జోన్, రంగారెడ్డి జోన్, మేడ్చల్ జోన్ ముఖ్య అధికారులు, టీజీఎస్పీడీసీఎల్ సిబ్బంది వారిని సాదరంగా ఆహ్వానించారు.అనంతరం వారు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తెలంగాణలో విద్యుత్ రంగం గత 120 సంవత్సరాలుగా



సాధించిన ప్రగతి, విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, స్మార్ట్ గ్రిడ్‌లు, డిజిటల్ సేవలు, వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు వారిని ఆకట్టుకున్నాయి.విద్యుత్ పంపిణీ వ్యవస్థలో టీజీఎస్పీడీసీఎల్ చేపడుతున్న ఆధునికీకరణ కార్యక్రమాలు, నెట్‌వర్క్ బలోపేతం, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అమలు చేస్తున్న వినూత్న చర్యలపై అధికారులు వారికి వివరించారు. విద్యార్థులు, యువత, ప్రజలకు విద్యుత్ రంగంపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఎగ్జిబిషన్‌ను రూపొందించినందుకు వారు అభినందనలు తెలిపారు.ప్రజల్లో విద్యుత్ భద్రత, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు, విద్యుత్ రంగంలో సాంకేతిక పురోగతి గురించి అవగాహన పెంపొందించడంలో ఇటువంటి ప్రదర్శనలు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.

# పంటల నుంచి ప్రాజెక్టుల దాకా..పల్లె పల్లెన పొన్నం అన్న పల్లెల్లో ప్రజాపాలన..

- **అడుగడుగునా ప్రజల ఆశీర్వాదం..**
- **విజయవంతంగా కొనసాగుతున్న కార్యక్రమం.**
- **చిగురుమామిడి మండలంలో ఐదు గ్రామాల్లో మంత్రి పర్యటన..**
- **ప్రజల సమస్యలపై అక్కడికక్కడే స్పందన..**
- **అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**

**నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్..**

**హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ**

చిగురుమామిడి: రైతు పొలంలో పంట నుంచి భారీ సాగునీటి ప్రాజెక్టు వరకు.. గ్రామంలోని విద్యుత్ సమస్య నుంచి ఇంటింటి సంక్షేమ పథకాల వరకు.. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం చిగురుమామిడి మండలంలో ప్రత్యేకతను చాటుకుంది. సోమవారం కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, ఓగులాపూర్, గునుకులపల్లి గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు.. అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి ఆదేశాలు, అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చారు.

### గౌరవెల్లి పూర్తితో హుస్నాబాద్‌కు జలభరోసా

కొండాపూర్‌లో మంత్రి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందని, మూడు జిల్లాల కలెక్టర్లు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.గౌరవెల్లి కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని మంత్రి కోరారు. భూసేకరణ ప్రక్రియ సాఫీగా పూర్తయితే భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు.ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ ఫామ్‌పాండ్‌నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. నవాబుపేట గ్రామం ఇంకుడు గుంతల నిర్మాణంలో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని పిలుపునిచ్చారు.గునుకులపల్లిలో రైతులు తమ పొలాల్లో ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, తద్వారా బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు.

### ఆయిల్‌ఫామ్ వైపు రైతుల ఆసక్తి

వ్యవసాయంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ఒకే సంప్రదాయ పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్‌ఫామ్, నువ్వులు, ఆముదాలు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

ముఖ్యంగా ఇందుర్తి గ్రామంలో మంత్రి పిలుపుకు రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేందుకు రైతులు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఆయిల్‌ఫామ్ సాగుతో ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతుల ఆసక్తిని అభినందిస్తూ సాగు విస్తరణకు అవసరమైన ప్రోత్సాహం అందేలా చూడాలని అధికారులను సూచించారు.

విద్యుత్ సమస్యపై తక్షణ స్పందన

నవాబుపేటలో గ్రామస్తులు విద్యుత్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా.. ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామంలో సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

కొండాపూర్‌లోనూ విద్యుత్ సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేయగా.. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి యంత్రాంగాన్ని కదిలించడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు.

గ్రామానికో అభివృద్ధి హామీ

ఐదు గ్రామాల పర్యటనలో ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి మంత్రి ప్రత్యేక హామీలు ఇచ్చారు.గునుకులపల్లి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయిస్తానని తెలిపారు. వివో బిల్డింగ్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.ఓగులాపూర్లో చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం సేకరించిన భూముల అంశాన్ని రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముంపునకు గురైన భూముల్లో పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కొండాపూర్లో గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, అంగన్‌వాడీ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.నవాబుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఇందుర్తిలో గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం

ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా చేయూత అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.కొండాపూర్‌లో ఇప్పటికే 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి మంత్రి మంజూరు పత్రాలు అందించారు. గుడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని కూడా ప్రారంభించారు.నవాబుపేటలో 21, ఇందుర్తిలో 32, గునుకులపల్లిలో 36, ఓగులాపూర్‌లో 8 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే మంజూరయ్యాయి. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని అధికారులు తెలిపారు.

సంక్షేమ పథకాలతో వేల కుటుంబాలకు ప్రయోజనం

ఐదు గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను అధికారులు మంత్రి సమక్షంలో వివరించారు.

కొండాపూర్‌లో 573 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.2.30 కోట్లు, 284 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.2.03 కోట్ల ప్రయోజనం కలిగింది.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

**121 రకాల మద్యం బ్రాండ్స్ కు నోటిఫికేషన్ ఇవ్వడం పై మాజీ మంత్రి హరిశ్ రావు ఫైర్**

**హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ**

జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందనీ ధ్వజమెతరు

121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందనీ తెలిపారు యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు, మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు?

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే.. మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా? అని యువత డిగ్రీలు, పిజీలు పూర్తి చేసి, జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మద్యం షాపులు పెంచి, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోంది. టైం కు యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు.. మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నదన్నారు

2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మోసం

ఫీజు రీయింబర్స్ మెంట్ మోసం

రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయిందనీ మండిపడ్డారు

మేనిఫెస్టోలో చెప్పిన హామీలకు గతి లేకుండా పోయింది.

రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా తయారైంది.

జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన? ఇదేనా అని తెలిపారు

# విశాఖపట్నం నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్?24.50 లక్షల విలువైన 48 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ**

విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీకి అక్రమంగా గంజాయిని కొనుగోలు చేసి రవాణా చేస్తున్న ఒక అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని ఆబిడ్ రోడ్డు పోలీసులతో కలిసి కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) బృందం అరెస్ట్ చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని సిటీ కన్వెన్షన్ సెంటర్ వద్ద




దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కేసు వివరాలు:

నేరం నమోదు: ఆబిడ్ రోడ్ పోలీస్ స్టేషన్ (జతీ.చీశీ. 268/2026, ఖ/ం. 8(ఎ), 20(ఎ)(అఅ)(జ), ూవఎ 27ూ, 29 చీణూూాూఎ)

అరెస్ట్ అయిన నిందితుడు:

దీజీజూ (గంజాయి రవాణాదారుడు)

పరారీలో ఉన్న నిందితులు:

బండియా (రైడర్/అమ్మకందారుడు, న్యూఢిల్లీ)

నౌషాద్ అలియాస్ సునీల్ (గంజాయి సరఫరాదారుడు, విశాఖపట్నం)

రాజేష్ (గంజాయి సరఫరాదారుడు, విశాఖపట్నం)

అంకిత్ కుమార్ అలియాస్ శివ (గంజాయి రవాణాదారుడు, బీహార్)

స్వాధీనం చేసుకున్న సొత్తు (మొత్తం విలువ: ?24,50,000/-):

48 కిలోల పొడి గంజాయి (24 సీల్డ్ ప్యాకెట్లను బ్రౌన్ టేప్‌తో చుట్టి, 2 ఎయిర్ క్యారీ బ్యాగులు, 2 పెద్ద బ్రీఫ్‌కేసులలో దాచారు)

ఎ×మూ ం4= 5+ మొబైల్ ఫోన్

కేసు నేపథ్యం:

ఇంటర్మీడియట్ వరకు చదివిన దీజీజూ, బ్లింకిట్ (దీశ్రీఅఅఎ్ఱ) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తన చిన్ననాటి మిత్రుడు అంకిత్ కుమార్ అలియాస్ శివతో చేతులు కలిపాడు. అంకిత్ అతడిని న్యూఢిల్లీకి చెందిన బండియాకు పరిచయం చేశాడు. బండియా సూచనల మేరకు అంకిత్, దీజీజూ విశాఖపట్నం వెళ్లి నౌషాద్, రాజేష్‌ల నుంచి 48 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు.ఆ గంజాయిని 24 ప్యాకెట్లుగా చేసి బ్యాగుల్లో దాచుకుని, 22-08-2026న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ నుండి ఆటోలో నాంపల్లికి బయలుదేరగా, మార్గమధ్యంలో ఢిల్లీ రైలు వేళలు కనుక్కుంటానని చెప్పి అంకిత్ ఆటో దిగిపోయాడు. దీజీజూను సిటీ కన్వెన్షన్ సెంటర్ వద్ద వేచి చూడమని చెప్పాడు. అంకిత్ కోసం వేచి చూస్తున్న సమయంలో ముందస్తు సమాచారం ఆధారంగా టాస్క్‌ఫోర్స్ మరియు ఆబిడ్ రోడ్ పోలీసులు దాడి చేసి దీజీజూను గంజాయితో సహా పట్టుకున్నారు.

ఈ దర్యాప్తు అరెస్ట్ ప్రకియను ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ పి. రాఘవేందర్, ఆబిడ్ రోడ్ పిఎస్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కె. ప్రసాద్ రావు, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ జి. శ్రీకాంత్, ఆబిడ్ రోడ్ పిఎస్ ఎస్ఐ పి. శ్రీకాంత్ మరియు సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు.

# TSERC ఛైర్మన్, సభ్యుల అభిప్రాయాలు

**హైదరాబాద్ ఆగస్టు 24 జన తెలంగాణ**



తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ూాజు=జ) ఛైర్మన్ డా. జస్టిస్ దేవరాజు నాగార్జున మాట్లాడుతూ, టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ ఎగ్జిబిషన్--2026 ఎంతో వినూత్నమైన, ప్రజలకు ఉపయోగకరమైన కార్యక్రమమని ప్రశంసించారు. విద్యుత్ రంగ చరిత్ర, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా అంశాలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థపై విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రదర్శనను రూపొందించడం అభినందనీయమన్నారు.విద్యుత్ రంగంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు, సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న యువతకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు వచ్చిన విశేష స్పందనను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్‌లో విద్యుత్ రంగ చరిత్ర, సాంకేతిక పరిణామాలను ప్రతిబింబించే శాశ్వత ప్రదర్శన కేంద్రం లేదా మ్యూజియం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.అదేవిధంగా రాష్ట్ర రాజధానికే పరిమితం కాకుండా జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి పవర్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తే మరింత మంది విద్యార్థులు, ప్రజలు ప్రయోజనం పొందగలరని అభిప్రాయపడ్డారు. ఈ వినూత్న ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ గారిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ూాజు=జ సభ్యులు రఘు కంచర్ల (టెక్నికల్), చెరుకూరి శ్రీనివాసరావు (ఫైనాన్స్) కూడా పవర్ ఎగ్జిబిషన్‌ను ప్రశంసించారు. విద్యుత్ రంగ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువత నుంచి లభించిన స్పందన ఈ కార్యక్రమం విజయాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంటూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాలని సూచించారు.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 25, 2026

## స్టార్‌లతో సందడిగా సాగిన 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' ఫైనల్‌లో విజేతగా గెలుపొంది కిరీటం దక్కించుకున్న గౌతమ్

జన తెలంగాణ సినిమా

తెలుగువారి ఫేవరేట్ ఓటీటీ ఆహా తాజా ఒరిజినల్ షో 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' తొలి సీజన్ ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన గ్రాండ్ ఫినాలేలో గౌతమ్ విజేతగా నిలిచారు. ఈ ఫైనల్‌లో షోకు చెందిన ఆరుగురు ఫైనలిస్టులతో పాటు లైవ్ ఆడియన్స్, స్పెషల్ జడ్జ్ గా ప్రముఖ డైరెక్టర్, యాక్టర్ తరుణ్ భాస్కర్ పాల్గొన్నారు.




తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్‌లో సరికొత్త ఫార్మాట్‌గా రూపొందిన 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' కంప్లీట్ గా ఇన్‌ఫ్లుయెన్సర్లు, క్రియేటర్లతో ఒక కొతత్ ఎంటర్ టైన్ మెంట్ వరల్డ్ ను క్రియేట్ చేసింది ఆహా. 8 ఎపిసోడ్‌లుగా సాగిన ఈ షోలో వివిధ రంగాలకు చెందిన క్రియేటర్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, డిఫరెంట్ థీమ్స్, ఫార్మాట్స్‌లో కంటెస్టెంట్స్ ఛాలెంజెస్ ఫేస్ చేశారు. వారి క్రియేటివిటీ, పర్సనాలిటీ, కంటెంట్ రూపొందించే సామర్థ్యం, ప్రేక్షకులతో ఉన్న అనుబంధాన్ని ఈ ఛాలెంజెస్ ద్వారా వ్యూయర్స్ ముందుంచారు.

సీజన్ చివరి దశలో 'ఫ్యాన్ పార్టీ' పేరుతో ప్రత్యేక ఫినాలేను నిర్వహించారు. ఇందులో క్రియేటర్లు, వారి ఫ్యాన్స్ మధ్య ఉన్న బాండింగ్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. సాధారణ ఫైనల్స్‌కు భిన్నంగా, ఈ ఎపిసోడ్‌లో లైవ్ ఆడియన్స్ ఓట్లను కూడా తుది ఫలితంలో భాగం చేశారు. దీంతో విజేతను నిర్ణయించడంలో అభిమానులకు నేరుగా భాగస్వామ్యం కల్పించినట్లయింది. ఫైనల్‌లో టైటిల్ కోసం ఆరుగురు ఫైనలిస్టులు పోటీ పడ్డారు. చివరి ఎపిసోడ్‌కు తరుణ్ భాస్కర్ ప్రత్యేక న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. తన అనుభవంతో పోటీ చివరి దశకు మరింత స్పెషాలిటీ తీసుకొచ్చారు.

థ్రిల్లింగ్ గా సాగిన ఫైనల్ అనంతరం 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' విజేతగా గౌతమ్ కిరీటం దక్కించుకున్నారు. అనిరుధ్, ప్రవీణ ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలవగా, రవి సెకండ్ రన్నర్-అప్ స్థానాన్ని కలిసి పంచుకున్నారు. ఈ ఫినాలే కేవలం పోటీని మాత్రమే కాకుండా, డిజిటల్ క్రియేటర్ల ప్రభావం ఎలా పెరుగుతోందో, అలాగే వినోద రంగాన్ని తీర్చిదిద్దడంలో ప్రేక్షకుల పాత్ర ఎలా కీలకంగా మారుతోందో కూడా చాటిచెప్పింది. క్రియేటర్-ఫస్ట్ ఫార్మాట్, విభిన్నమైన సవాళ్లు, ప్రేక్షకుల ఆధారిత ఫినాలేతో 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' రియాలిటీ ఎంటర్‌టైన్‌మెంట్, సోషల్ మీడియా, క్రియేటర్ కల్చర్‌ల మధ్య ఉన్న సరికొత్త రిలేషన్ ను ఆవిష్కరించింది.

తొలి సీజన్ విజయంతో ప్రాంతీయ వినోద రంగంలో క్రియేటర్ బేస్డ్ ఫార్మాట్లకు ఉన్న అవకాశాలు మరింత స్పష్టమయ్యాయి. అదే సమయంలో 'టాప్ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్' ఆహా ఒరిజినల్ కంటెంట్‌లో ఒక ప్రత్యేకమైన షోగా తన స్థానాన్ని ఏర్పరుచుకుని కొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది.

## 'ఇరుముడి'కి ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఆనందంతో కళ్లు చెమర్చాయి. ఇంత పెద్ద సక్సెస్ అందించిన ప్రేక్షకులకు థాంక్యూ: ఇరుముడి బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్‌లో మాస్ మహారాజా రవితేజ







జన తెలంగాణ సినిమా

మాస్ మహారాజా రవితేజ హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్‌తో, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో ఘన విజయాన్ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.

బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ శివ ఈ సినిమా కోసం చాలా మంచి ఆర్టిస్టులను ఎంచుకున్నారు. కొమరం, భార్గవ్, కిషోర్ అందరూ సూపర్‌గా చేశారు. చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. అలాగే రమేష్ ఇంద్ర గారు కూడా బాగా చేశారు. స్టూడెంట్స్‌గా చేసిన అందరూ చక్కగా చేశారు. వాళ్లందరికీ చాలా మంచి ఫ్యూచర్ ఉంది. సాయి సురేష్ చాలా నేచురల్‌గా ఆర్ట్ వర్క్ చేశారు. తను చాలా జెన్యూన్ పర్సన్. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడతాడు. అలాగే మా డీఓపీ విష్ణు అమేజింగ్ వర్క్ ఇచ్చాడు. తను చాలా స్పీడ్‌గా వర్క్ చేస్తాడు. అలాగే దినేష్ సీలేరులో అన్నీ చాలా అద్భుతంగా చూసుకున్నారు. బాబా భాస్కర్, శేఖర్ మాస్టర్, అలాగే మా డైరెక్టర్ శివ ఈ సినిమాకి అద్భుతమైన కొరియోగ్రఫీ చేశారు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ గారు, రియల్ సతీష్ అద్భుతమైన యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. సతీష్‌తో ఇంకా చాలా సినిమాలు చేయాలి. జీవీ ప్రకాష్ మ్యూజిక్ ఈ సినిమాకి సోల్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఆ మ్యూజిక్‌తో ఆటోమేటిక్‌గా ప్రేక్షకులకు కళ్లలో నీళ్లు వచ్చేస్తున్నాయి. మా అమ్మాయి మోక్ష కూడా ఈ సినిమా చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. మా నిర్మాతలు రవి, నవీన్ నాకు చాలా మంచి స్నేహితులు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూసి వాళ్లు పడుతున్న ఆనందం మాటల్లో చెప్పలేను. వాళ్లతో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. కోవిడ్ తమిళ్ మలయాళ సినిమాలు ఎక్కువగా చూశాం. అవన్నీ రూటెడ్‌గా ఉండేవి. అలాంటి కంటెంట్ చూస్తున్నప్పుడు మన దగ్గర కూడా ఇలాంటి కంటెంట్ చేస్తే బాగుంటుంది కదా అనిపించేది. 'ఇరుముడి'కి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా, మీడియాలో ఎక్కడ చూసినా 'ఇరుముడి' సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు. ఆడియన్స్ రియాక్షన్స్ చూస్తుంటే నా కళ్ళు చెమర్చాయి. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం థియేటర్‌కి వచ్చిన వాళ్లు మళ్లీ 'ఇరుముడి' సినిమా చూడడానికి థియేటర్‌కి రావడం కూడా చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఈ ఆనందం మామూలుది కాదు. నాది రాతి గుండె. నాకు సాధారణంగా ఏడుపు రాదు. అలాంటిది ఈ సినిమా చూసి ఏడ్చేశాను. డైరెక్టర్ త్రినాథ్ పాత్ర, 'ఇరుముడి' అనే టైటిల్ చెప్పగానే నెక్స్ట్ లెవెల్ అనిపించింది. మా శీను ఈ సినిమా విషయంలో చాలా నమ్మకం పెట్టుకున్నాడు. మొదటి నుంచి 'సూపర్‌హిట్ సినిమా సార్' అని చెబుతూనే ఉండేవాడు. తన నమ్మకం నిజమైంది. ఇంత మంచి సినిమా చేసినందుకు మా డైరెక్టర్ థాంక్యూ. తనది చాలా గొప్ప వ్యక్తిత్వం. ఇంత పెద్ద విజయం వచ్చినా సరే చాలా నార్మల్‌గా ఉంటాడు. ప్రియా భవాని శంకర్ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. ఈ సినిమాలో ఆ ఎమోషన్ పండడానికి తను సెకండ్ హాఫ్‌లో చేసిన ఆ రెండు సీన్స్ ఎంతగానో హెల్ప్ అయ్యాయి. అలాగే బేబీ నక్షత్ర అద్భుతంగా చేసింది. తనకి చాలా బ్రైట్ ఫ్యూచర్ ఉంటుంది.డైరెక్షన్ టీమ్‌కి, ప్రొడక్షన్ టీమ్‌కి, ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. ఈ సినిమాకు వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ విన్న తర్వాత, చూసిన తర్వాత ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థం కాలేదు. మాటలకు అందని రియాక్షన్ ఇది. ఎంత పెద్ద సక్సెస్ అయిందో ఆ రియాక్షన్‌లో అర్థమైంది. 'ఇరుముడి' సినిమా ఒక దర్శకుడికి, నిర్మాతకి, హీరోకి, డిస్ట్రిబ్యూటర్‌కి, ప్రేక్షకుడికి ఒక సినిమా ఎంత ఇవ్వాలో అంత ఇచ్చింది. ఈ సినిమాలో చిన్న పని చేసిన వారు కూడా ఈ సినిమాకు పనిచేశామని గొప్పగా చెప్పుకునే ఆనందాన్ని ఇచ్చింది. డిస్ట్రిబ్యూటర్స్, ప్రొడ్యూసర్స్‌కి మేము హ్యాపీగా ఉన్నామని చెప్పే సందర్భాలు చాలా తక్కువగా ఉంటాయి. 'ఇరుముడి' సినిమాకు డిస్ట్రిబ్యూషన్స్ నుంచి వస్తున్న కాల్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. 'నిన్ను కోరి', 'మజిలీ' సినిమాలను ఆడియన్స్ తమ ఇళ్లల్లోకి తీసుకున్నారు. ఈ సినిమాతో ఆడియన్స్ నన్ను గుండెల్లోకి తీసుకున్నారు. ఈ సినిమా విజయం నాకు మరింత బాధ్యతను పెంచింది. రవితేజ సినిమా కోసం ఏం కావాలో అవన్నీ చేశారు. ఒక హీరో దర్శకుడికి ఇచ్చే స్వతంత్రతే ఈ సినిమాలో ఉన్న గొప్పతనం. ఈ సినిమా ప్రయాణంలో శ్రీనివాసరాజు చాలా సపోర్ట్ చేశారు. రవితేజ గారి కుమార్తె కూడా కథ విని చాలా ఎమోషనల్ అయ్యారు. మొన్న సినిమా చూసి కూడా అదే ఎమోషన్‌తో మాట్లాడారు. సాయికుమార్ గారు కథ చెప్పిన తర్వాత నాకంటే ఎక్కువగా ఇన్వాల్వ్ అయ్యారు. చాలా ఓన్ చేసుకుని సినిమా చేశారు. డీఓపీ విష్ణు, డైరెక్టర్ సాయిసురేష్ నేచురల్ వర్క్ ఇచ్చారు. అనంత శ్రీరామ్, కళ్యాణ్ చక్రవర్తి చక్కగా లిరిక్స్ రాశారు. నవీన్ మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి చేసిన 'ఖుషి' సినిమా చాలా మంచి సక్సెస్ అయింది. కాకపోతే ఆ సినిమా ఇంకా పెద్ద విజయాన్ని మేము ఊహించుకున్నాం. ఇరుముడి అలాంటి పెద్ద విజయాన్ని అందుకుంది. మైత్రి మూవీ మేకర్స్ చాలా సెన్సిబుల్ ప్రొడ్యూసర్స్. ప్రియా భవాని శంకర్ గారు కావేరి పాత్రని చాలా రియలిస్టిక్‌గా చేశారు. నక్షత్ర చాలా ధైర్యం గల పాప. తను మణెమ్మ పాత్రలో ఎంతలా జీవించిందో ఆడియన్స్ రియాక్షన్స్ చెప్తున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ ఈ కథ వినగానే పాత్ బ్రేకింగ్ సినిమా అవుతుందని చెప్పారు. కల్ట్ క్లాసిక్ మూవీ అవుతుందని ట్వీట్ చేస్తానన్నారు. కానీ నేనే వద్దని చెప్పాను. ఆ రోజు ఆయన రాసుకున్న ట్వీట్‌ను ఈరోజు నాకు చూపించారు. మా సినిమా మీద ఆయనకు అంత నమ్మకం ఉంచారు. సినిమాకి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. అలాగే స్వసికకు టీచర్ పాత్ర చెప్పగానే, ఎలాంటి అనుమానాలు లేకుండా పాత్ర చాలా బాగుందని, ఒక నటిగా నేను నిరూపించుకుంటానని చెప్పి చాలా అద్భుతంగా చేసింది. అలాగే ఈ సినిమాలో స్టూడెంట్స్‌గా చేసిన మిగతా ఆర్టిస్టులు కూడా చాలా అద్భుతంగా నటించారు. ఈ సినిమాలో పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. రవితేజగారు నాకు అన్నయ్యతో సమానం అయిన మీడియా కూడా ఈ సినిమాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. ఈ పెద్ద సక్సెస్ ఇచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

ప్రియా భవాని శంకర్ మాట్లాడుతూ.. ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఈ సినిమాను చెన్నైలో చూశాను. ప్రేక్షకులు అందరూ కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. విష్ణు సాయి సురేష్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. అలాగే ఈ సినిమాలో నటించిన అందరూ కూడా చాలా చక్కని పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ సినిమాకు ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన మీడియాకు, సోషల్ మీడియాకు, ప్రేక్షకులకు అందరికీ థాంక్యూ. డైరెక్టర్ శివ నిర్వాణ ఒక క్లాసిక్ సినిమా తీశారు. తను ఈ సినిమా దర్శకుడిగా చాలా కాలం గుర్తుండిపోతారు. ఈ సినిమాను మించిన సినిమా ఆయన మళ్లీ తీయాలని కోరుకుంటున్నాను. కావేరి లాంటి పాత్ర ఇచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు. విజయాన్ని అందుకున్న మా నిర్మాతలకు కంగ్రాజులేషన్స్. రవితేజ గారు చాలా సపోర్ట్ చేశారు. ఆయనతో కలిసి నటించడం గౌరవంగా భావిస్తున్నాను. రవితేజ గారితో కలిసి చేసిన ఈ సినిమా ఒక మెమరబుల్ మూవీగా మిగిలిపోతుంది. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సినిమాకు ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్యూ.

బేబీ నక్షత్ర మాట్లాడుతూ.. 'ఇరుముడి' సినిమా బ్లాక్‌బస్టర్ కావడం చాలా ఆనందంగా, ఎమోషనల్‌గా ఉంది. ఈ సినిమాకు ఇంత పెద్ద విజయాన్ని అందించిన అందరికీ కృతజ్ఞతలు. మణెమ్మగా నన్ను అభిమానించిన మీ అందరికీ కృతజ్ఞతలు. నాకింత గొప్ప అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్, నిర్మాతలకు, మా హీరో రవితేజ గారికి థాంక్యూ.

నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. ముందుగా ఇది మనందరి సినిమాగా ముందుకు తీసుకెళ్లిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. సినిమా చూసిన అందరూ ఇస్తున్న రెస్పాన్స్ నాకు చాలా ఆనందాన్ని ఇస్తుంది. మేము ఇప్పటివరకు ఎన్నో సినిమాలు తీశాం గానీ, ఇంత ఎమోషనల్ అయిన సినిమా 'ఇరుముడి'. ఈ సినిమా చూసి వస్తున్న ఆడియన్స్ రెస్పాన్స్ చూస్తున్నా, చదువుతున్నా కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి. ఈ సినిమా అంతా ప్రభావితం చేసింది. అయ్యప్ప స్వామి మా రవితేజ గారికి పెద్ద హిట్ ఇస్తే, రవితేజ గారు మొత్తం మా టీమ్ అందరికీ పెద్ద హిట్ ఇచ్చారు. ఇదంతా ఒక చైన్ రియాక్షన్‌లాగా జరిగింది. సినిమా రోజురోజుకీ పెరుగుతోంది. మా డైరెక్టర్ శివ ఒక మ్యాజిక్ చేశాడు. ఈ సినిమాకి ఎదురు లేదు. మరో నాలుగు వారాలు వెళ్తూనే ఉంటుంది. చాలా పెద్ద నెంబర్స్ కనిపిస్తాయని భావిస్తున్నాం. అందరికీ థాంక్యూ.

నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ.. సినిమా విడుదలైనప్పటి నుంచి అభినందనలు, కలెక్షన్స్ రిపోర్ట్స్ నిరంతరంగా వస్తూనే ఉన్నాయి. ఈ సినిమాను ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ చేసిన ఆడియన్స్‌కి కృతజ్ఞతలు. రవితేజ గారికి ఈ సినిమా చూడగానే కాల్ చేసి చెప్పాను. ఎక్స్‌ట్రార్డినరీ పెర్ఫార్మెన్స్. ఇలాంటి క్యారెక్టర్ రవితేజ గారే చేయగలరు. ఈరోజు ఆడియన్స్ రియాక్షన్ కూడా అలానే ఉంది. అన్ని వైపుల నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. ఒక సినిమా విడుదలైన రోజున్నరలోనే లాభాల్లోకి రావడం యాభై ఏళ్లలో ఎప్పుడూ జరగలేదని డిస్ట్రిబ్యూటర్స్ చెప్తుంటే చాలా హ్యాపీగా అనిపించింది. ఈ సినిమాను మేము చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రభంజనం మరో నాలుగు వారాలపాటు కంటిన్యూ అవుతుంది. ఈ సినిమా ఇంకా చూడని వారు తప్పకుండా థియేటర్‌కి వెళ్లి సినిమా చూడాలని కోరుకుంటున్నాను.

సాయికుమార్ మాట్లాడుతూ.. 'ఇరుముడి' సినిమా మా అందరికీ గొప్ప ఎమోషన్. మైత్రి మూవీ మేకర్స్ చాలా అద్భుతంగా ఈ సినిమాని తీశారు. మొదట సీలేరులో ఒక మెడికల్ క్యాంపు నిర్వహించి, మంచి కార్యక్రమంతో ఈ సినిమా షూటింగ్‌ను మొదలు పెట్టడం జరిగింది. మంచి మనసుల కలయిక ఈ 'ఇరుముడి'. 'ఇరుముడి' కారణంగా సీలేరు పెద్ద టూరిస్ట్ స్పాట్‌గా మారింది. నా 50 ఏళ్ల ప్రస్థానంలో 'ఇరుముడి' లాంటి సినిమా చేయడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాను. రవితేజ అంటే మా ఫ్యామిలీ. . మైసూర్‌లో ఈ సినిమా చూశాను. అక్కడ కూడా థియేటర్ అంతా హౌస్‌ఫుల్‌గా ఉంది. నాగార్జున గారి షూటింగ్‌కి మైసూర్ వెళ్లాను. నాగార్జున గారు కూడా రవితేజకు కంగ్రాట్స్ చెప్పారు. ఇందులో అందరూ కూడా అద్భుతంగా నటించారు. ఈ సక్సెస్‌కు కారణమైన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.

అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. శివ నిర్వాణ గారు ఈ కథ మొదలైనప్పటి నుంచి అలాగే ముగింపుకు కావలసిన పాటలను నాతో రాయించే గొప్ప బాధ్యతను నా మీద పెట్టారు. ఈ సినిమా నా ప్రస్థానంలో ఒక గొప్ప అదృష్టం. రవితేజ గారు ఇలాంటి విజయాలు మళ్లీ మళ్లీ అందుకోగలరు. మైత్రి మూవీ మేకర్స్ నటీనటులు, టెక్నీషియన్లు అందరినీ కూడా తమ వ్యాపార భాగస్వాములుగా భావిస్తారు. అందుకే వారికి వరుసగా విజయాలు వస్తున్నాయి. వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.

స్వసిక మాట్లాడుతూ.. 'ఇరుముడి' సినిమాకి పాన్ ఇండియా నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. అన్ని భాషల ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన రవితేజ గారికి, డైరెక్టర్ శివ నిర్వాణ గారికి, మా నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్‌కు ధన్యవాదాలు. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

డీఓపీ విష్ణు శర్మ మాట్లాడుతూ.. 'మజిలీ' తర్వాత డైరెక్టర్ శివ నిర్వాణ గారితో ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. అలాగే నేను తెలుగు సినిమాకు వచ్చినప్పటి నుంచి మైత్రి మూవీ మేకర్స్‌లో పనిచేయాలని కోరిక. ఈ సినిమాతో అది తీరింది. రవితేజ గారికి ఎందుకు అంత క్రేజ్ ఉందో ఆయనతో పని చేసిన తర్వాత తెలిసింది. ఆయన డెడికేషన్ అద్భుతం. ఈ సినిమా చూస్తున్న ఆడియన్స్ అద్భుతమైన రెస్పాన్స్ ఇస్తున్నారు. చివరి 30 నిమిషాలు కంటతడి పెట్టుకున్నామని చెప్తున్నారు. మేము ఆ సన్నివేశాలు షూట్ చేస్తున్నప్పుడు కూడా అంతే ఎమోషనల్ అయ్యాం. సినిమాని బ్లాక్ బస్టర్ చేసిన అందరికీ థ్యాంక్యూ వెరీ మచ్. ఈ వేడుకలో టీం అందరూ పాల్గొన్నారు.

## కింగ్ నాగార్జున లాంచ్ చేసిన అల్లరి నరేష్, చంద్ర మోహన్ చింతాడ, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ 'రంభ ఊర్వశి మేనక' హిలేరియస్ ట్రైలర్

జన తెలంగాణ సినిమా

అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. పౌరాణిక కథలు, గ్రామీణ హాస్యం, వినోదాత్మకమైన అంశాలతో అలరించనుంది. కింగ్ నాగార్జున ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు.

సూరి(అల్లరి నరేష్) మొక్కుబడులతో భూలోకానికి దిగివచ్చిన రంభ, ఊర్వశి, మేనకలు.. తమ దివ్య శక్తులను కోల్పోవడంతో అసలు కథ మొదలవుతుంది. ముగ్గురు అప్సరసలు తన ఇంట్లో ఉండటంతో సూరికి ఎదురయ్యే ఇబ్బందులు, అతడి ప్రేయసి గొడవ, పోలీసుల విచారణ, మరోవైపు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్న తల్లి.. ఇలా వరుస సమస్యలతో కథలో ఎంటర్టైమెంట్ ని ట్రైలర్ అద్భుతంగా ప్రజెంట్ చేసింది.

ట్రైలర్‌ను దర్శకుడు చంద్ర మోహన్ చింతాడ ఆద్యంతం ఎంటర్‌టైనింగ్‌గా నడిపించారు. ముఖ్యంగా అల్లరి నరేష్, నరేష్ వీకే మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. సోషల్ మీడియాలో పాపులర్ అయిన 'లవ్ యూ బచ్చేస్' డైలాగ్‌ను కూడా ఫన్నీగా ఉపయోగించారు. 'ఓజీ'లోని జపనీస్ డైలాగ్‌ను సరదాగా వాడిన విధానం ట్రైలర్‌కు మంచి కామెడీ ఎండింగ్ ఇచ్చింది.

ట్రైలర్‌లో అల్లరి నరేష్ మరోసారి తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. అమాయకత్వం, ఎనర్జీ, కామెడీ కలగలిపిన ఆయన పాత్ర సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. సురభి కథానాయికగా నటించగా, వెన్నెల కిషోర్ ఇంద్రుడి పాత్రలో నవ్వులు పూయించారు. నరేష్ వీకే కూడా అల్లరి నరేష్‌తో కలిసి వచ్చే సన్నివేశాల్లో మెప్పించారు. రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ ముగ్గురు అప్సరసలుగా అలరించారు.

రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ చిత్రానికి కలర్‌ఫుల్ లుక్ తీసుకొచ్చింది. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్ ఫాంటసీ ప్రపంచాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దగా, చైతన్ భరద్వాజ్ సంగీతం ట్రైలర్‌లోని ఎంటర్‌టైన్‌మెంట్ మూడ్‌కు ఎలివేట్ చేసింది.

ట్రైలర్ చూస్తుంటే 'రంభ ఊర్వశి మేనక' పల్లెటూరి హ్యూమర్, పురాణ నేపథ్యం, ఫాంటసీ అంశాలను కలిపిన ఒక డిఫరెంట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా అలరించింది. ముఖ్యంగా కామెడీ జానర్‌లో అల్లరి నరేష్ బలాన్ని మరోసారి పూర్తిగా ఉపయోగించుకున్న సినిమాగా అలరించబోతుంది.

తారాగణం: అల్లరి నరేష్, సురభి, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిషోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, రచ్చ రవి, మురళీధర్ గౌడ్

సాంకేతిక సిబ్బంది:
దర్శకత్వం: చంద్రమోహన్ చింతాడ
నిర్మాతలు: రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్
బ్యానర్లు: అన్నపూర్ణ స్టూడియోస్ ఛ హాస్య మూవీస్
సంగీతం: చైతన్ భరద్వాజ్
డిఓపి: రాంరెడ్డి
ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి
ఎడిటర్: ఛోటా కె ప్రసాద్
పీఆర్వో: వంశీ-శేఖర్

# 'టాక్సిక్' జోష్.. 5 లక్షల టికెట్స్ సేల్.. రూ.30 కోట్లు క్రాస్



యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' . ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది

తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి

గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించే సినిమా 'టాక్సిక్': యశ్

పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది. విశేషమేమిటంటే యూఎస్‌లో కన్నడ వెర్షన్ కంటే తెలుగు వెర్షన్ బుకింగ్స్‌కే అధికంగా ఉన్నాయి. రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' మూవీ అడ్వాన్స్ బుకింగ్స్ రికార్డులను ఇప్పటికే అధిగమించిన 'టాక్సిక్'.. రిలీజ్ నాటికి మరిన్ని మైలురాళ్లను దాటే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక




# ఆత్మవిశ్వాసాన్ని అప్పుగా తెచ్చుకోలేం కదా!

తన దృష్టిలో ఆత్మవిశ్వాసమే అన్నింటికన్నా గొప్పదని అంటోంది నాయిక త్రిప్తి దిమ్రీ. అగ్రతారల సరసన అవకాశాల్ని అందుకుంటూనే.. మరోవైపు ఓటీటీ వేదికగా వైవిధ్యమైన కథలతో సత్తా చాటుతోంది. ఇటీవలే 'మా బెహన్', 'ఓ రోమియో' లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించిన ఈ తార.. ప్రస్తుతం 'స్పిరిట్' సినిమా చిత్రీకరణతో బిజీగా గడుపుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది త్రిప్తి. "నేను సహజంగానే ఆత్మవిశ్వాసం వైపునకు ఆకర్షితురాలినవుతా. ఎందుకంటే దాన్ని అప్పుగా తెచ్చుకోలేం కదా!. అది మన అంతరాత్మ నుంచి వస్తుంది. మీ మీద మీకు ఆత్మవిశ్వాసం ఉంటే.. మిగతావన్నీ దానంతట అవే వస్తాయి. దీంతో పాటు ఏదైనా కార్యక్రమానికి వెళ్లే ముందు లేదంటే జనంతో నిండిన గదిలోకి వెళ్లే ముందుకు నన్ను నేను స్థిమితపరుచుకోవడానికి ఇష్టపడతా. ఎందుకంటే నేను ఇతరులతో మమేకం కావడానికి కన్నా ముందే.. నాతో నేను మమేకం కావాలని భావిస్తాన"ని చెప్పుకొచ్చింది త్రిప్తి.

# బాక్సాఫీస్ వద్ద 'ఇరుముడి' జోరు.. సూర్య మూవీ రికార్డు వసూళ్లు






చాలా రోజుల తర్వాత టాలీవుడ్ వరుస సినిమాలతో కళకళలాడుతోంది. ఈ ఆగస్టులో విడుదలైన ముఖ్య చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌ను సొంతం చేసుకున్నాయి. ఎన్నాళ్ల నుంచో హిట్ కోసం ఎదురు చూస్తున్న రవితేజ , ఆయన అభిమానుల ఆకలి తీర్చింది 'ఇరుముడి' . శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ తొలిరోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కేవలం రెండు రోజుల్లోనే రూ.47 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆదివారం చాలా థియేటర్‌ల బయట హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ ఏడాది సంక్రాంతి సినిమాల తర్వాత ఈ స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న మూవీ ఇదేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించిన ఈ చిత్రం బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషించింది. (ఇరుముడి రివ్యూ కోసం క్లిక్ చేయండి) విశ్వనాథ్ అండ్ సన్స్ రికార్డు వసూళ్లు సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ డ్రామా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితబైజు కథానాయిక. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ రికార్డు వసూళ్లు రాబడుతోంది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.200o కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. సూర్య, మమితల నటన, వెంకీ అట్లూరి టేకింగ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు విపరీతంగా నచ్చింది.

# అల్లరి నరేశ్ 'రంభ ఊర్వశి మేనక' ట్రైలర్.. నవ్వులే నవ్వులు




అల్లరి నరేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక' . చంద్రమోహన్ చింతాడ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలు కలిసి రూపొందిస్తున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. అల్లరి నరేశ్ శైలి హాస్యంతో పాటు, స్వర్గలోకం నేపథ్యం, సంభాషణలు వినోదాన్ని పంచుతున్నాయి. సురభి, రాశీ సింగ్, విష్ణు ప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిశోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో



# సెప్టెంబరులో సెట్స్ పైకి?

'ధురంధర్', 'యుఫోరియా' చిత్రాలతో ఉత్తరాది నుంచి దక్షిణాది సినీ ప్రియులకు యువ కథానాయికగా సుపరిచితమైంది బాలీవుడ్ తార సారా అర్జున్. కెరీర్ తొలినాళ్లలోనే ప్రాధాన్యత కలిగిన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఈమె.. ప్రముఖ నటి మధుబాల బయోపిక్‌లో నటించే అవకాశాన్ని దక్కించుకున్నట్లు ఇటీవల ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇంకా పేరు ఖరారు చేయని ఈ బయోపిక్‌ని 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కె.రీన్ తెరకెక్కిస్తున్నారు. దర్శకనిర్మాత సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాణంలో రాబోతున్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా ఈ సినిమా సెప్టెంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. "రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'లవ్ అండ్ వార్' సినిమా చిత్రీకరణను ఈ నెలాఖరులోగా గోరేగావ్‌లోని రాయల్ పామ్స్‌లో పూర్తి చేయనున్నారు భన్సాలీ. ఈ చిత్ర షూటింగ్ ముగిసిన వెంటనే ప్రొడక్షన్ డిజైన్ బృందం మధుబాల బయోపిక్ కోసం ఆ ప్రదేశాన్ని సిద్ధం చేయనుంది. సెప్టెంబరులో ఈ సినిమా షూటింగ్ ప్రారంభయ్యే అవకాశముంది. ఇప్పటికే సారా మధుబాల పాత్ర కోసం సన్నద్ధమవ్వడం ప్రారంభించారు. ఈ చిత్రంతో జస్మీత్ మధుబాల వ్యక్తిత్వాన్ని, హావభావాలు, ఆమె జీవించిన ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నార"ని బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.

# ఆత్మకథగా రజనీకాంత్ జీవిత ప్రయాణం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారు. తాజాగా ఈ విషయాన్ని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తాను కూడా ఆ పుస్తకం రాసే పనిలో పాల్గొన్నట్లు తెలిపారు. "నాన్నగారు తన ఆత్మకథ రాస్తున్నారు. ఆ పుస్తకాన్ని ఎలా రూపుదిద్దుతున్నారో నేను దగ్గర ఉండి చూశా. ఇది చాలా ఏళ్ల పాటు పాఠకులు మళ్లీ మళ్లీ చదివే పుస్తకంగా నిలుస్తుందని నమ్ముతున్నా. యోగి పరమహంస యోగానంద గారు రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం తరతరాలకు ఎంత స్ఫూర్తినిస్తుందో మా నాన్నగారి కథ కూడా అలాగే ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అతిపెద్ద నటులలో ఒకరిగా ఎదిగిన ఆయన ప్రయాణం సామాన్యమైంది కాదు. ఐదు దశాబ్దాలుగా ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు చివరి వారం థియేటర్/ఓటీటీ సినిమాలివే.. దృష్టంతా దానిపైనే..!తన



తండ్రి జీవితాన్ని తెరపైకి తీసుకువస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. "ఒకవేళ నాన్నగారి జీవితాన్ని సినిమాగా తీస్తే, అది నాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అత్యంత ప్రత్యేకమైందిగా ఉంటుంది. ఒక చిత్ర దర్శకుడు తనలోని ప్రతి ఆలోచనను ఒకే కథలో పెట్టలేడు. ఏ కథకు ఏది అవసరమో తెలుసుకోవాలి. మిగిలిన ఆలోచనలను భవిష్యత్తు కథల కోసం దాచుకోవాలి. సృజనకు స్పష్టత, క్రమశిక్షణ అవసరమని నాన్నగారు నాకు నేర్పారు. రజనీకాంత్ కుమార్తెగా పుట్టడం గొప్ప వరం. ఆయన కూతురునైనందుకు పోలికలు, అంచనాలు కూడా ఉంటాయి. నేను ఇష్టంతోనే చిత్రరంగంలోకి వచ్చాను. దాని గురించి నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు" అని చెప్పారు. రూపొందుతోంది. ఈ రొమాంటిక్ సిరీస్‌కు బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775